ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 1
అక్టోబర్ 2025





# ముగిసిన తీరొక్క పూల సందడి

## పూల జాతరలో ఆడి పాడిన ఆడపడుచులు

### నవరాత్రి శోభలో ఆలయాలు .. అమ్మవారి మండపాలు కిటకిట

### భక్తుల పారవశ్యం... నిర్వహకుల ఆనందం



భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన పూల పండుగ బతుకమ్మ వేడుకలు, చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిశాయి. రాష్ట్రంలోని పల్లెలు, పట్నాలు, పట్టణాలు తేడా లేకుండా ఎక్కడ చూసినా పండుగ వైభవం కనులపండువ చేసింది. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి.

ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు వచ్చే సద్దుల బతుకమ్మ కోసం ఆడపడుచులు అత్యంత భక్తి శ్రద్ధలతో సిద్ధమయ్యారు. ఉదయాన్నే ఇల్లంతా శుభ్రం చేసుకుని, పట్టు చీరలు, ఆభరణాలతో ముస్తాబయ్యారు. ప్రకృతిలో దొరికే రంగురంగుల గునుగు, తంగేడు, బంతి, చామంతి వంటి పూలతో అత్యంత పెద్ద ఆకృతిలో బతుకమ్మలను పేర్చారు. ఈ రోజున సాధారణంగా పెద్ద బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను కూడా పీఠంపై ఉంచి పూజించడం సంప్రదాయం.

సాయంత్రం కాగానే, బతుకమ్మలను తీసుకుని మహిళలందరూ వీధుల కూడళ్లకు, పెద్ద ప్రాంగణాలకు చేరుకున్నారు. ఒకరికొకరు తోడుగా బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి, కోలాహలం సృష్టించారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో" వంటి జానపద గీతాలను లయబద్ధంగా ఆలపిస్తూ, చప్పట్లు కొడుతూ ఆడిపాడారు. వారి ఆటాపాటలతో వీధులన్నీ మారుమోగిపోయాయి. ఉల్లాసం నిండిన ఈ సందడిలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సవంలో భాగమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో మహిళా బృందాలు దాండియా ఆటలు, కోలాటాలతో తమ ఉత్సాహాన్ని ప్రదర్శించాయి.

సద్దుల బతుకమ్మ నాడు అమ్మవారికి ఐదు రకాల ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. పెరుగన్నం, పులిహోర, కొబ్బరి సద్ది, నువ్వుల సద్ది, నిమ్మకాయ అన్నం వంటి సత్తు పిండి వంటకాలను తయారుచేసి, పూజ





భువనగిరిలో... మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సతీమణి వనిత బతుకమ్మతో



అనంతరం వాయినాలుగా ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ వాయినాల ఆదానప్రదానం ఆడబిడ్డల మధ్య ఆప్యాయత, అనురాగాన్ని పెంచింది. చివరగా భక్తిభావంతో బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా సమీపంలోని చెరువులు, నదులు, కుంటల వద్దకు తరలివెళ్లారు. అక్కడ పూల బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, అమ్మవారికి వీడ్కోలు పలికారు. వచ్చే ఏడాది మళ్లీ కలుసుకుందామంటూ "మల్లెన్నడొస్తావు చందమామ" అంటూ పాటలు పాడారు. ఈ పూల జాతర ముగింపుతో తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, ఆడపడుచుల ఐక్యత మరోసారి ప్రపంచానికి చాటి చెప్పబడింది. స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో పలు పదవులకు పోటీ చేయాలని భావిస్తున్న నాయకులు ఏర్పాట్లను చేసి తమ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులకు మంచి సదుపాయంతో పాటు రకరకాల స్నాక్స్ ను అందజేసి తమ గుర్తింపు కోసం అనేక పాట్లు పడ్డారు.

## బతుకమ్మ వైభవం



వర్షిణి అడుగులో అమ్మవారి నడక,
ఆమె రూపంలో దివి నుండి దీవెన.
ఎదురొస్తుంటే నా కళ్ళలో వెన్నెల,
సాక్షాత్తు దేవీ స్వరూపం నా చెంత.
ఆమె చేతిలో మెరిసే బతుకమ్మ,
రంగుల హారం, పూల
సింహాసనం.
గుమ్మడి, తంగేడు, బంతి
పువ్వుల సమాహారం,
తల్లి ఒడిలో పరచిన
ఆనంద గీతం.
ముందుకొస్తూ ఆ
బతుకమ్మ వెలుగు,
భక్తులను ఆశీర్వదిస్తూ
సాగే ఆ వేళ.
చుట్టూ ఆడిన కోలాటం
రాగం,
భువిని కలుపుతూ ఆ
పరమాత్మ యోగం.
తెలంగాణ సంస్కృతికి ఆత్మ
బతుకమ్మ,
ప్రతి ఇంట నవరాత్రుల
శోభ బతుకమ్మ.
నీటిలో నిమజ్జనమై తిరిగి
వచ్చే ఆశాదీపం,
మనసుకు శాంతినిచ్చే
పవిత్ర రూపం.
బతుకమ్మా... బతుకమ్మా...
అంటూ పిలిచే ఆ పాట,
స్త్రీల శక్తికి, పచ్చని పంటకు
నిత్యం తోడు.
మాతృ మూర్తుల పండుగ,
మన ఆడపడుచుల
పండుగ,
నిత్యం వర్ధిల్లుమా ఈ
పవిత్ర వైభోగం!

- గొట్టిపర్తి భాస్కర్
చీఫ్ ఎడిటర్
రోమింగ్ న్యూస్.







## నిమజ్జనానికి వేళాయే...

"పోయిరా గౌరమ్మ... పోయిరావమ్మా...!!"

